క్లుప్తంగా

కంటి ఆపరేషన్లకు 91 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీజైన్ సంఘం మందిరంలో ఆదివారం ఎస్వీ అరవింద్ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 200 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 91 మందిని ఉచిత ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు సుభాష్‌జైన్ పేర్కొన్నారు.

నేడు స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఐరాల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండల ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవాలని సూచించారు.

భక్తిప్రపత్తులతో దోపోత్సవం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

వి.కోట: పట్టణంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజైన ఆదివారం రాత్రి దోపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను కొలువు దీర్చి పట్టణ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహిళలు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఉభయదారులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త సీతారామయ్య, భక్తుల్ల పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజావరోహణం



పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి వారు మంగళవాయిద్యాల హోరు నడుమ రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఆలయం వద్ద అభిషేకం, వసంతోత్సవం, ప్రత్యేక పూజలు, ధ్వజావరోహణం, త్రిశూల స్నానం..ఇత్యాది కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం శయనోత్సవంతో ఆలయ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ చైర్మన్ వీరభద్ర చెప్పారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఈఓ చంద్రమౌళికి విరాళమిస్తున్న బెంగళూరు వాసి

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద నిత్యాన్నదానానికి బెంగళూరు అమృత హళ్లికు చెందిన ఉదయ్‌కుమార్, వనిత దంపతులు రూ.25 వేల విరాళమిచ్చారని ఆలయ ఈఓ చంద్రమౌళి ఆదివారం తెలిపారు. కోరిన కోర్కెలు ఫలించడంతో అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు, పాల క మండలి సభ్యుడు పవన్ కుమార్ దంపతులను సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 1 నుంచి 10వ తేదీ వరకు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఆదివారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలు, పూజా సామాగ్రిని శుద్ధి చేసి సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణం చేశారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, అర్చకులు పాల్గొన్నారు.

తాళంబేడుకు అభివృద్ధి తోరణం

టీడీపీ ప్రభుత్వంలో ఆ గ్రామమంటే చిన్న చూపు. పథకాల అమలులో వివక్ష చూపించింది. అక్కడ జరిగే అభివృద్ధికి టీడీపీ నేతల అడ్డంకులు సుడిగుండంలా మారాయి. ప్రభుత్వ పథకాల అమలులో పచ్చ నేతలు కుట్రలు చేశారు. ఈ కారణంగా ఆ గ్రామానికి అందాల్సిన అరకొర సంక్షేమ ఫలాలు కనుచూపుమేరలో కనిపించలేదు. రేషన్‌కార్డుల ఊసే లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామానికి అభివృద్ధి తోరణం పడింది. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు ఇంటింటా అందుతున్నాయి. ఆగ్రామం వివరాల్లోకి వెళదాం.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి మోక్షం
- రాజకీయాలకు అతీతంగా ఫలాల వర్తింపు
- టీడీపీ ప్రభుత్వంలో తాళంబేడుపై వివక్ష



- ఈ చిత్రంలో కనిపిస్తున్న సిమెంట్‌రోడ్డు తాళంబేడు గ్రామం – తెల్లగుండ్ల వలస మీదుగా వెళుతుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.4 కి.మీ మేర రూ. 2.47 కోట్ల వ్యయంతో ఈ రోడ్డును నిర్మించారు. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. పలుమార్లు పాలకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ కారణంగా ఈ రోడ్డు ప్రయాణం అవస్థల నడుమ సాగేది. వర్షం వస్తే రాకపోకలు స్తంభించేవి. పిల్లలు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి. రోడ్డు నిర్మాణ అనంతరం రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవు.



- ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు జీ.ప్రమీల. ఈమె వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారు. ఏటా రూ.18,750 ఆమె బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తోంది. తొలి విడత నగదును ఇతరత్రా అవసరాలకు వాడకుండా చిన్న ఉపాధి కోసం వెచ్చించింది. జిరాక్స్ మిషన్ కొనుగోలు చేసింది. తద్వారా ప్రతిరోజు రూ.200 ఆదాయం వచ్చేలా చేసుకుంటోంది. గిరాకీ ఉన్న సమయంలో రూ.1,500 వరకు సంపాదిస్తోంది. ఈ ఆదాయం ఆమె కుటుంబానికి ఎంతో కొంత ఉపయోగపడుతోంది.

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో తాళంబేడు పంచాయతీ ఉంది. ఈ పంచాయతీలో 10 గ్రామాలున్నాయి. 745 కుటుంబాలకు గాను 2,924 జనాభా ఉంది. టీడీపీ ప్రభుత్వంలో తాళంబేడు పంచాయతీని పూర్తిగా విస్మరించింది. అభివృద్ధి పనుల జాడ కూడా కనిపించలేదు. దీంతో తాళంబేడు అభివృద్ధికి దూరమైంది. ప్రధానంగా తాళంబేడు గ్రామం నుంచి దళితవాడకు వెళ్లే మార్గం అస్తవ్యస్తంగా ఉండేది. పలుమార్లు దీనిపై పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన వర్గపోరుకు ఆ రోడ్డు అభివృద్ధికి అడ్డంకులు పడ్డాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ రోడ్డు రూపురేఖలు మార్చేంది. కోట్లాది రూపాయలు వెచ్చించి మెరుగైన బాటలు వేసింది. దీంతో ప్రయాణం సులభతరంగా సాగుతోంది. అలాగే ప్రాథమిక పాఠశాలను రూ.5 లక్షల మేర వెచ్చించి బడిని బాగుచేయించింది. జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కూడా రూ.18 లక్షల మేర వ్యయం చేస్తోంది. అదనపు భవన నిర్మాణం, తదితర పనులను శరవేగంగా పూర్తి చేస్తోంది. టి.వేపనపల్లి గ్రామ సమీపంలో రూ.లక్షలాది విలువ చేసే భూమిలో పేదలకు ఇంటిస్థలం కేటాయించారు. సచివాలయం, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు.

ఇంటింటా ఫలాలు

టీడీపీ ప్రభుత్వంలో తాళంబేడు పంచాయతీకి మొండి చేయి చూపించారు. రేషన్‌కార్డుకు కూడా జన్మభూమి కమిటీ సభ్యులు అడ్డుతగిలారు. పక్కా ఇళ్ల మంజూరును కేవలం తెలుగు తమ్ముళ్లకు మాత్రమే కేటాయించారు. దీంతో పేదలు ఆ అరకొర పథకాలకు దూరమయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయం ద్వారా రాజకీయాలకు అతీతంగా పథకాలు దక్కుతున్నాయి. తలుపు తట్టి రేషన్‌కార్డు, పింఛన్‌తోపాటు సంక్షేమ పథకాలను మంజూరు చేయిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు కూడా అర్హత ఉంటే ఇచ్చేస్తున్నారు. ఇలా వివిధ పథకాల ద్వారా 4,298 మంది రూ.13.47కోట్లు లబ్ధిపొందినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. దీంతో గ్రామ ప్రజలు సైతం ప్రభుత్వ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొత్త హంగులు దిద్దుకున్న తాళంబేడు ప్రాథమిక పాఠశాల



ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు



తాళంబేడు సచివాలయం భవనం

గత నాలుగేళ్లలో సంక్షేమం, అభివృద్ధి

పథకం	లబ్ధిదారుల సంఖ్య	నగదు రూ.ల్లో
ఆసరా	457	1,41,33,235
అమ్మ ఒడి	233	90,16,947
హౌసింగ్	101	1,35,73,819
వసతి దీవెన	120	14,33,556
జగనన్న విద్య దీవెన	139	35,85,348
పింఛన్	575	5,09,55,000
రైతు భరోసా	443	22,99,4,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	94	32,18,701
వైఎస్సార్ చేయూత	145	67,87,500
ఇళ్ల పట్టాలు	130	1,15,00,000
రైస్‌కార్డు	763	1,66,66,972



టి.వేపనపల్లెలో గృహ నిర్మాణాలు

వైఎస్సార్ సీపీతోనే మొదలియార్ల సంక్షేమం



విజయానందరెడ్డికి ఆత్మీయ స్వాగతం పలుకుతున్న మహిళలు

చిత్తూరు రూరల్: నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి..నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మొదలియార్ కులస్తుల సంక్షేమం సాధ్యమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానంద రెడ్డి అన్నారు. ఆదివారం చిత్తూరు నగరంలోని మురకంబట్టులో మొదలియార్ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత కట్టమంచి నుంచి మురకంబట్టు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విజయానందరెడ్డి పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో విజయానందరెడ్డి మాట్లాడుతూ బీసీలుగా గుర్తిస్తూ మహానేత వైఎస్సార్ తెచ్చిన జీఓ మొదలియార్ కులస్తులకు వరంగా మారిందని తెలిపారు. తండ్రి బాటలో అడుగులు వేస్తూ .. తనను నమ్మినవారిని గుర్తించి గౌరవించడంలో సీఎం జగనన్న బ్రాండ్ అంబాసిడర్ అని పేర్కొన్నారు. మొదలియార్ కులస్తులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. మొదలియార్ సామాజికవర్గ ప్రజలకు వైయస్సార్, జగనన్న చేసిన మేలును పలువురు నాయకులు ప్రశంసించారు. నాయకులు ఏజీ బాలాజీ, దొడ్డిపల్లి శివ, తిరుకుమరన్, చిన్ని, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి, టవున్ బ్యాంక్ చైర్మన్ రామ్ గణేష్, కార్పొరేటర్లు, నాయకులు సునీతా, శివకుమార్, నవీన్ కుమార్, జ్ఞాన జగదీష్ , సహదేవన్, ఇందు ఏకాంబరం, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు పలు రైల్వే అభివృద్ధి పనుల ప్రారంభం

వెబ్‌నార్ ద్వారా ప్రారంభించనున్న పీఎం

చిత్తూరు కార్పొరేషన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ఉదయం 11 గంటలకు వెబ్‌నార్ ద్వారా పలు ప్రారంభోత్స కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రైల్వే వాణిజ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ ఆదివారం తెలిపారు. అందులో భాగంగా పెనుమూరు వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి, చిత్తూరు, పాకాల, కుప్పం, మదనపల్లె స్టేషన్ల ఆధునీకరణ కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారని వివరించారు

గాంధీ తత్వాన్ని అలవరచుకోవాలి



నవలను ఆవిష్కరిస్తున్న వీసీ, అతిథులు

తిరుపతి సిటీ: మొక్కవోని ధైర్యంతో అహింసా మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపి విజయం సాధించిన మహాత్మాగాంధీ తత్వాన్ని, ఆలోచన విధానాన్ని మనం అలవర్చుకోవాలని ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో మూరిశెట్టి గోవింద్ రచించిన 'సుదీర్ఘ స్వప్నం' నవలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం, మన దేశం అనే భావన మనిషిలో కొరవడిందని, నేను అనే భావన సమాజంలో నెలకొనడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ సిద్ధాంతాలు, దేశభక్తి ప్రతి వ్యక్తి అలవర్చుకోవాలని కోరారు. సుదీర్ఘ స్వప్నం గాంధీ ఇతివృత్తంతో రాసిన పుస్తకమని తెలియజేశారు. అనంతరం సమీక్షకులు డాక్టర్ పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గాంధీ ఆశయాలను విస్మరించవద్దన్నారు. నవల విశిష్టతను, రచనా శిల్పాన్ని ఆయన ఈ సందర్భంగా సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాగోలు క్రిష్టారెడ్డి, డాక్టర్ సాకం నాగరాజు, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, బాలసుబ్రమణ్యం, గంగాధరప్రసాద్, ఆముదాల మురళి, రామచంద్రారెడ్డి, దామోదరం సుభద్ర, రాజు, రచయితలు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం అలరించింది. బెంగళూరుకు చెందిన రంజని, ఉమేష్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా రంగపూజ, పుష్పాంజలి, తొడియంగల, గణపతి స్తోత్రం, థిల్లాన, అన్నమయ్య సంకీర్తనలు తదితర పాటలకు కళాకారులు ప్రణమ్మ, ధాన్విక, దీపిక, సహస్ర, సాన్వికా రెడ్డి, గౌతమి, జ్ఞాపిక, ఇషిత, అఫ్సాన, అక్షయ, లావణ్య దిశా, ప్రజ్ఞా భరద్వాజ్, సృజతన, శ్రీనిధి నాగరాజ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

బంగారుపాళెం: మండల కేంద్రంలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. మొత్తం 1,255 మంది అభ్యర్థులకు గానూ 1,059 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. 196 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 375 మంది అభ్యర్థులకు గానూ 319 మంది హాజరు కాగా, 56 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మందికి గానూ 192 మంది హాజరు కాగా, 48 మంది పరీక్షకు హాజరు కాలేదని, సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో 240 మందికి గాను 201 మంది పరీక్ష రాశారని, 39 మంది రాలేదన్నారు. విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో 400 మంది అభ్యర్థులకు గానూ 347 మంది పరీక్షకు హాజరు కాగా, 53 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద బంగారుపాళెం సీఐ నాగరాజారావు, ఎస్ఐ మల్లికార్జున పర్యవేక్షణలో సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు సరి చూసుకుంటున్న అభ్యర్థులు

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న పైమాఘం సుగుణాకర్ రెడ్డి

తవణంపల్లె: మండలంలోని పైమాఘం దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అర్ధగిరి ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పైమాఘం దళితవాడలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైమాఘం అభివృద్ధికి ఎంతో చేశానని తెలిపారు. అలాగే దళితుల శ్మశానానికి దారి ఏర్పాటు చేస్తామని, కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. దళితులు ఐకమత్యంతో అభివృద్ధి కావాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్ జి.కరీం మాట్లాడుతూ దళితులకు తమ వంతు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. తన సొంత నిధులతో తాగునీటి బోరు వేయిస్తానని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పార్టీ మండల నాయకులు అన్ని వర్గాలను కలుపుకుని పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో అరగొండ సర్పంచ్ మల్లుదొరై, అరగొండ సచివాలయ కన్వీనర్ ప్రశాంత్‌కుమార్, పైమాఘం దళితులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ గోల్డ్ సేవలు విస్తృతం



మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి

చిత్తూరు రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సేవలను మరింత విస్తృతం చేయాలని, ఇందు కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు క్లబ్ జిల్లా గవర్నర్ రామరాజ్, అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం క్లబ్ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత సభ్యులు క్లబ్ తరపున చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. నిత్యాన్నదానం, రూ.6 లక్షలతో వాటర్ ప్లాంట్ నిర్మాణం, అనాథ శవాలకు అంత్యక్రియలు, మొక్కలు నాటే కార్యక్రమం, కైలాసథామం, కంటి వైద్య శిబిరం తదితర సేవ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు సభ్యులను ప్రసంసాపత్రాలతో సత్కరించారు. వైస్ జిల్లా గవర్నర్ చంద్రారెడ్డి, సభ్యులు ప్రభాకర్, జాఫర్, మోహన్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కనిపించని పూత.. రైతన్నకు వెత



దిగువ మోదలపల్లె మామిడి తోటలో కానరాని పూత

తవణంపల్లె: మండలంలో మామిడి రైతులకు పూత దిగులు పట్టుకుంది. సాధారణంగా డిసెంబర్, జనవరిలోనే పూత రావాల్సి ఉంది. వాతావరణ మార్పుల వల్ల, గత ఏడాది ఆలస్యంగా పంట కోత కోయడం వల్ల పూత రావడంలో ఆలస్యంగా రైతులు భావిస్తున్నారు. పూత కోసం ఇప్పటికి రెండు పర్యాయాలు రైతులు మందులను పిచికారీ చేశారు. కొన్ని తోటల్లో అక్కడక్కడ పూత కనిపిస్తుండగా, కొన్ని చెట్లు పూత, చిగుర్లు కూడా రాకుండా మొద్దుబారి ఉన్నాయి. మండలంలో 12,520 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నా 40 శాతం కూడా పూత రాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. మండలంలో 90 శాతం మంది రైతులు మామిడి పంటపై ఆధారపడి ఉన్నారు. ఏటా దిగుబడి రాకపోవడం, దిగుబడి వస్తే ధరలు లేకపోవడం, చీడలు, పీడలతో దిగుబడులు తగ్గిపోవడం పరిపాటిగా మారింది. ఆలస్యంగా పూత వచ్చినా నిలబడదని రైతులు అంటున్నారు.

మందులు పిచికారీ చేయాలి



సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటించి, మందులు పిచికారీ చేస్తే పూత బాగా వస్తుంది. వాతావరణంలో మంచు కారణంగా ఈ ఏడాది పూత రావడంలో ఆలస్యం అవుతోంది. పూత రాని తోటలకు నీటి తడులు ఇవ్వాలి. పురుగుల బెడద ఉంటే నివారణకు మందులు పిచకారీ చేయాలి. పురుగుల నివారణకు బెప్రోఫిజిన్ 750 ఎంఎల్, తెగుళ్ల నివారణకు థయోఫినేట్ మెథైల్ 500 గ్రాములు, బంక నివారణకు ప్లానోఫిక్స్, శాండోవిట్ మందు పిచికారీ చేయాలి.

–సాగరిక, ఉద్యాన అధికారి, బంగారుపాళ్యం

నిబద్ధతతో విధులు నిర్వర్తించండి

- జిల్లా ఎస్పీ జాషువా



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జాషువా

కుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జాషువా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆదివారం జిల్లా పోలీస్ యంత్రాగంతో సమావేశం నిర్వహించారు. సోమవారం సీఎం పర్యటన నేపథ్యంలో సిబ్బందికి కేటాయించి స్థలానికి సమయాలని చేరుకోవాలని, వైర్‌లెస్ సెట్‌కు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. సభకు వచ్చిన జనంతో మర్యాదగా ప్రవర్తించి, పిటీషన్లుతో వస్తే వారిని ఎస్పీ, కలెక్టర్ కార్యాలయం వద్దకు చేర్చాలని ఆయన ఆదేశించారు. అలాగే ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్న పక్షంలో వెంటనే పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెలిప్యాడ్ వద్ద భద్రత పటిష్టం చేసి, గ్యాలరీలో సామర్థ్యానికి మించి ప్రజలను అనుమతించరాదని, అలాగే ఎలాంటి ఇబ్బంది కలగకుండా పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. సీఎం పర్యటనకు నలుగురు అడిషనల్ ఎస్పీలు, 17 మంది డీఎస్పీలు, 47 మంది సీఐలు, 133 మంది ఎస్ఐలు, అదనపు సిబ్బందితో బందోస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.